

నేడు జిల్లా స్థాయి స్పందన రద్దు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



భీమవరం:స్థానిక కలెక్టరేట్లో ప్రతి సోమవారమూ నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్పందనను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లావాసులు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో ప్రజలు ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.

ఎన్నో ఆశలతో నూతన సంవత్సరంలోకి జిల్లా ప్రజానీకం అడుగుపెడుతున్నారు. దీర్ఘకాలికంగా కొనసాగుతున్న సమస్యలకు కొత్త ఏడాది 2024లోనైనా పరిష్కారం దొరుకుతుందని ఆశలు పెట్టుకుంటున్నారు. పోలవరం నిర్వాసితులకు అందించాల్సిన పరిహారం నుంచి అనేక సమస్యలు జిల్లాను పట్టిపీడిస్తున్నాయి. తాగునీటి సమస్య, అధ్వానంగా రోడ్ల వ్యవస్థ, పెరిగిన ధరలు ఇలా అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కొత్త ప్రభుత్వాలు కొలువుదీరనున్నాయి. ప్రజల ఆదరణ పొంది అధికారంలోకొచ్చే ప్రభుత్వాలైన ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తాయో లేదో వేచిచూడాలి.

కొత్త ఏడాదిపై..

ఆశలు.. ఆకాంక్షలెన్నో..!



- పోలవరం నిర్వాసితులకు పరిహారం అందేనా
- న్యాయం కోసం 'చింతలపూడి' రైతులు ఎదురుచూపు
- అధ్వాన రోడ్ల వ్యవస్థ బాగుపడేనా
- తాగునీటి సమస్యకు పరిష్కారమెప్పుడో
- కౌలురైతులు కన్నీటి వ్యథలు తీరేనా
- కొండెక్కిన ధరలు తగ్గేనా

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకొస్తే పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలకు పరిహారం పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం ఇస్తామని, భూమికి భూమి సమస్యలు పరిష్కరిస్తామని వైసిపి చెప్పింది. నాడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ గడిచిన నాలుగున్నరేళ్లుగా పోలవరం నిర్వాసితులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తూనే ఉన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. కొత్త ఏడాదిలోనైనా తమకు ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వాలని పోలవరం నిర్వాసితులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. వరదల సమయంలో కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెంలో పర్యటించిన సిఎం జనవరి, ఫిబ్రవరిలో నెల్లో నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం ఇస్తామని ప్రకటించారు. దీంతో ఈ ఏడాదైనా పరిహారం అందుతుందేమోనని నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లయినా ఇప్పటికి నెరవేర్చలేదు. అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.12 లక్షల పరిహారం ప్రకటించగా, బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.40 లక్షలుపైనే ఉందని, ఎకరాకు కనీసంగా రూ.30 లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి నోరు మెదపడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,200 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రోడ్ల వ్యవస్థ ఉంది. చాలా రోడ్లు అత్యంత దారుణంగా మారాయి. ప్రతిపక్షంలో ఉండగా రోడ్ల గురించి పాదయాత్ర చేసిన నాయకులు ప్రస్తుతం ఎంఎల్ఏలు, ఎంపిలుగా ఉన్నారు. నాలుగున్నరేళ్ల గడిచిన రోడ్ల వైపు చూడలేదు. ఆక్వా చెరువుల కారణంగా డెల్టాలో తాగునీరు పూర్తిగా కలుషితమైంది. కొనుగోలు చేసే తప్ప దాహం తీరే పరిస్థితి లేకుండా పోయింది. వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని వైసిపి చెప్పింది. రూ.1400 కోట్లకు సంబంధించి అంచనాలు తయారు చేసినా ఇప్పటి వరకూ అడుగు ముందుకు పడలేదు. దీంతో ఈ ఏడాదైనా ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలని జనం కోరుతున్నారు.

కౌలురైతుల కన్నీటి వ్యథలు

రెండు జిల్లాల్లో మూడున్నర లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. 80 శాతం ఆయకట్టు సాగులో కౌలురైతులకు ఎటువంటి గుర్తింపూ లేకుండాపోయింది. కౌలుచట్టంలో మార్పులు చేసి వైసిపి ప్రభుత్వం కౌలురైతులను నిలువునా దెబ్బతీసింది. గుర్తింపు కార్డులు, బ్యాంకురుణాలు, పంటనష్టపరిహారం, బీమా ఏదీ కౌలురైతులకు అందడం లేదు. గడిచిన ఏడాది రబీ, ఖరీఫ్‌లోనూ వర్షాలు, తుపాను రైతులను నిలువునా దెబ్బతీశాయి. అయినప్పటికీ కౌలురైతులకు ఎటువంటి న్యాయమూ జరగలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లలో డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ముంపు, నీటిఎద్దడి సమస్యలతో రైతులు బాధపడుతున్నారు. ఆక్వా రైతుల కన్నీటిగాథలు, పామాయిల్ రైతుల కష్టాలు, మొక్కజొన్న రైతుల ఆర్తనాదాలు ఇలా అనేక సమస్యలకు ఈఏడాదైనా పరిష్కారం దొరుకుతుందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ధరలతో కుదేలు

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొలువుదీరాక నిత్యావసరాల ధరల నుంచి పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకి ఎగబాకాయి. దీంతో కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో రూ.150పైనే పలుకుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు రూ.వందపైనే ఉన్నాయి. అందుకు తగిన విధంగా ఆదాయం మాత్రం పెరగలేదు. దీంతో సామాన్య ప్రజానీకం బతుకుబండి భారంగా మారింది. 2024లోనైనా ధరలకు కళ్లెం వేసి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని జనం కోరుతున్నారు.

భవిష్యత్తు ఒక కల.. వర్తమానం ఒక వాస్తవం.. గతం ఒక జ్ఞాపకం. అనేక అనుభవాల సారాన్ని తనలో ఇముడ్చుకుని.. కష్టసుఖాల సమ్మేళనానికి వేదికైన 2023 ఇక సెలవు అంటూ కాలగమనంలో తెరమరుగైంది. కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ నేనొచ్చేశా అంటూ నూతన సంవత్సరం 2024 కోటి ఆశల నడుమ ఆవిష్కృతమైంది. ఉప్పొంగే ఉత్తేజం.. ఊపిరిపోసే ఆశల నడుమ కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘనస్వాగతం పలికారు.





విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారు కావాలి

బాలోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి – భీమవరం రూరల్

బాలోత్సవాల ద్వారా విద్యార్థులు శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలుగా తయారు కావాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో జరిగిన బాలోత్సవంలో భాగంగా ఆదివారం రెండో రోజు జాతీయ పతాకాన్ని రాజా రామ్మోహన్ రాయ్ (ఆర్ఆర్‌డి) ద్విశత జయంతి డిగ్రీ కళాశాల గతకాలపు ప్రిన్సిపల్ ఎస్‌వి రమణారావు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలో స్వాతంత్ర సమరయోధులతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు పద్మభూషణ్ స్వామి జ్ఞానానంద, అయ్యగారి సాంబశివరావు, ఎల్లాప్రగడ సుబ్బారావు వంటి వారు జన్మించి ప్రపంచానికి, దేశానికి ఎన్నో సేవలందించారన్నారు. అటువంటి వారి ప్రేరణ బాలోత్సవంలో బాలలకు అందించాలన్నారు. అనంతరం మ్యాజిక్, మ్యూజిక్ షోలు అక్కడికి వచ్చిన బాలలందరినీ అలరించాయి. సంగీత విద్వాంసుడు, గాయకుడు పిప్పళ్ల ప్రసాద్ రఘుపతి రాఘవ రాజారాం.. పతీత పావన సీతారాం అంటూ మహాత్మా గాంధీ సారథ్యంలో స్వాతంత్రోద్యమంలో ముందుకు నడిపించిన గేయాన్ని ఆలపించారు. అనంతరం మత సామరస్యాన్ని ప్రబోధించే ఏది హిందూ.. ఏది ముస్లిం.. ఏది క్రైస్తవం ..ఎల్ల మతముల సారమొక్కటే.. హృదయమే మతం అంటూ పాట పాడారు. మ్యాజిక్ స్టార్ దంతులూరి బోసు మ్యాజిక్ షోలో సిద్ధార్థుడు బుద్ధునిగా ఎలా రూపాంతరం చెందాడో మ్యాజిక్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ బత్తిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి బాలలందరూ రేపటి భావి భారత పౌరులన్నారు. బాలోత్సవం ద్వారా ఉత్తమ పౌరులుగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని తెలిపారు. ముందుగా జిపిసి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో రోప్ స్కిప్పింగ్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రాజును సత్కరించారు. అనంతరం అకడమిక్ అంశాలను సాంస్కృతిక ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సంబరాలకు భీమవరం, ఉండి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారి వెంట ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. వీరికి అల్పాహారం, భోజన సదుపాయాలు నిర్వాహకులు కల్పించారు. శనివారం నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు ప్రశంసాపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణారావు, ప్రముఖ నేత్ర వైద్యులు రమణరాజు, ప్రిన్సిపల్ అయ్యర్, కె.రాజు, ఎస్ఆర్‌కెఆర్ కళాశాల అధ్యక్షులు జగపతి రాజు అందజేశారు. కార్యక్రమంలో వేలాది మంది బాల బాలికలతో పాటు బాలోత్సవం అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు, కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షులు గాతల జేమ్స్, చెరుకువాడ రంగసాయి, చైతన్య ప్రసాద్, సిహెచ్ సాయిరాం, అల్లూరి అరుణ్, జి.ధనుష్, కలిగట్ల గోపాలశర్మ చాన్ భాష, మల్లుల శ్రీనివాస్, డిఎన్ఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కె.శివాజీ రాజు, రేపాక వెంకన్నబాబు, కొత్తపల్లి అశోక్, హేలాపురి బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పాల్గొన్నారు.



ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

పోటీ కార్మికులను తీసుకొస్తే ఊరుకోం

6వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి – భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి జెఎసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు నీలాపురాజు బంగారు వరలక్ష్మి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోటీ కార్మికులను తెచ్చి రెచ్చగొట్టే చర్యలు చేపడుతోందని విమర్శించారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు. ధర్నాలో జెఎసి నాయకులు బి.వాసుదేవరావు, నీలాపు నాని, ఎన్.ధనలక్ష్మి, రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే పోటీ కార్మికులను పెట్టడం ఏంటని తూర్పు, పశ్చిమ గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న సమ్మె 6వ రోజు చేరింది. మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం పోటీ కార్మికులను నియమించడంతో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య కొంతసేపు ఘర్షణ జరిగింది. ఆ సమయంలో వచ్చిన ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ గత పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నిజం కాదా అని ప్రశ్నించారు. పర్మినెంట్ చేయాలని కార్మికులు కోరడం రాజ్యాంగ విరుద్ధమా అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్ నేడు అన్నీ రివర్స్‌లో చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయనప్పుడు చివరిగా సమ్మె చేసే హక్కు ఉందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటికైనా సమ్మె విచ్ఛిన్నం గురించి కాకుండా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ఆదినారాయణ బాబు, ఎ.కృష్ణబాబు, మందులయ్య, కె.అయ్యప్ప, జ్యోతి బాబు, సుధాకర్, రాజమ్మ, జి.కుసుమ, శ్రీనివాస్, కె.వెంకన్న, జి.లక్ష్మి, రాంబాబు పండు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తణుకులో సమ్మెలో చేస్తున్న మున్సిపల్ కార్మికులు, పాల్గొన్న ఐవి

మరోసారి మననం..



బరులే మారాయి.. కోడిపందేలు యథాతథం.. ★ ★ ★



జనవరి : రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ చీకటిమాటున వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 1ని రద్దు చేయాలని టిడిపి, వామపక్షాలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టాయి. సంక్రాంతి నేపథ్యంలో జోరుగా సాగిన కోడి పందేల బరుల్లో రాజకీయ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ అనారోగ్యంతో మృతి చెందారు.

విద్యాసంస్థల్లో కలకలం.. ★ ★ ★



ఫిబ్రవరి: చింతలపూడి బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు 14 మంది, తణుకులోని ఆకుల బుల్లబ్బాయి 6వ నంబర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు 15 మంది అస్వస్థతకు గురవ్వడం కలకలం సృష్టించింది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పేర్లను వైసిపి అధిష్టానం ప్రకటించింది. ఏలూరు సమీపంలోని చొదిమెళ్లలో జరిగిన జోన్–2 సమీక్షా సమావేశంలో టిడిపి అధినేత చంద్రబాబు మాట్లాడుతూ ఆక్వా రైతులకు హామీలు గుప్పించారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి గెలుపు.. ★ ★ ★





మార్చి:మొగల్తూరు మండలం కెపిపాలెం సౌత్ బీచ్‌లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ అనూహ్య పరిణామాల నడుమ ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకుని నిర్బంధించడంతో వారి నినాదాలతో ఏలూరు దద్దరిల్లింది. దెందులూరులో ఆసరా నిధులను బటన్ నొక్కి సిఎం జగన్ విడుదల చేశారు. పశ్చిమ రాజకీయాల్లో పెద్దాయన, అజాత శత్రువుగా పేరొందిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి కన్నుమూశారు.

అకాల వర్షం.. అపార నష్టం.. ★ ★ ★



ఏప్రిల్ : జిల్లాలో పలు ప్రాంతాల్లో వీచిన ఈదురుగాలులు, కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, అరటి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏలూరు రేంజ్ డిఐజిగా అశోక్‌కుమార్, ఏలూరు ఎస్‌పిగా మేరి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్‌గా లావణ్య వేణి నియమితులయ్యారు. మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నూజివీడు మండలంలో పర్యటించారు. ఆచంట మండలం భీమలాపురం వద్ద గోదావరిలో దిగి ఇద్దరు విద్యార్థులు గిరిధర్, భానుప్రసాద్ మృతి చెందారు.

ఎండల తీవ్రతకు విలవిల...



మే :రైతు పోరుబాట యాత్రలో భాగంగా చంద్రబాబు రెండు రోజులు తణుకు ప్రాంతంలో పర్యటించారు. వర్షానికి తడిచిన ధాన్యాన్ని చంద్రబాబు పరిశీలించారు. ఈదురుగాలుల బీభత్సంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగ్గా ఒక మహిళ మృతి చెందింది. ఎండల తీవ్రతకు జనం విలవిల్లాడారు.

మార్మోగిన 'పోలవరం పోరుకేక'..



జూన్ : సిఎం జగన్ పోలవరంలో పర్యటించారు. పర్యాటక కేంద్రంగా పోలవరాన్ని తీర్చిదిద్దుతానని ప్రకటించారు. మొగల్తూరులో వివాహ వేడుకకు వచ్చిన ఇద్దరు యువకులు పేరుపాలెం బీచ్‌లో నీట మునిగి మృతి చెందారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో ఎసిబి నిర్వహించిన తనిఖీల్లో రూ.2.5 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించారు. జనసేన వారాహి యాత్ర జిల్లాలో ప్రవేశించింది. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ పోలవరం పోరుకేక మహా పాదయాత్ర జిల్లాలోని ఏజెన్సీ మండలాలు, ఏలూరు మీదుగా సాగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ ఎన్నికయ్యారు.

గోదావరి ఉరకలు.. ★ ★ ★



జులై :భీమవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకుల్లో జరిగిన వారాహి యాత్ర సభల్లో పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. అంగన్‌వాడీల 36 గంటల ధర్నాతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. ఆశాలూ ధర్నా నిర్వహించారు. గోదావరి ఉగ్రరూపానికి వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు జలదిగ్బంధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన పంట పొలాలు.

రాజకీయ యాత్రలు.. ★ ★ ★



ఆగస్టు: పెదవేగి జవహర్ నవోదయ పాఠశాలలో ఆహారం కలుషితమై 70 మంది విద్యార్థులకు అస్వస్థత. పోలవరంలో చంద్రబాబు పర్యటించారు. పునరావాస ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటించారు. జిల్లాలో లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించింది.

హత్య, అత్యాచారంతో కలవరం.. ★ ★ ★



సెప్టెంబర్ :ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాలను సిఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. కారుతో ఢీకొట్టి.. కత్తులతో నరికి భీమవరంలో పట్టపగలే నడిరోడ్డుపై దారుణహత్య చోటుచేసుకోవడం భయభ్రాంతులకు గురిచేసింది. ఒపిఎస్ అమలు కోరుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. విజయవాడలో ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. భీమవరంలో బాలికపై బాబాయి అత్యాచారానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది.

మాతా శిశు మరణాలు.. ★ ★ ★



నవంబర్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నవజాత శిశువు, గర్భిణి మృతి చెందారు. వైద్యులు సరైన చికిత్స అందించలేదని, అందుకే పండంటి బిడ్డ మృతి చెందిందని నవజాత శిశువు కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆచంట మండలం వల్లూరుతోటలో గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధ దంపతులు మృతి చెందారు.

విలాపం.. విషాదం.. ★ ★ ★



డిసెంబర్ : మిచౌంగ్ తుపాన్ రైతులను, జిల్లా వాసులను తీవ్ర నష్టాల్లో ముంచింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆకివీడు సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదం నింపింది. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.

ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు.. ★ ★ ★



అక్టోబర్ : ఏలూరులో నగరంలో సుపారీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. స్థిరాస్తి వ్యాపారిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేసి.. పిస్టళ్లతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం ఫ్యాక్షన్ మాఫియాను తలపించింది. నూజివీడు ట్రిపుల్ ఐటి మెస్‌లో భోజనం సరిగా లేదని, అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థులు ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఐకెపి విఒఎలు, మెప్మా ఆర్‌పిలు రోడ్డెక్కారు. వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. డిమాండ్లు నెరవేరే వరకూ రాజీలేని పోరాటం చేస్తామంటూ ఏలూరు కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపట్టారు. రహదారిపై వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు.





సమ్మెలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులతో చర్చలు జరిపి సమ్మె విరమింపచేయాలని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జహరోరాజు డిమాండ్ చేశారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారంతో 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన ఎస్టియు నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని చెప్పి ఇప్పుడు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే సర్వ శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏసుబాబు

రంగురంగుల హరివిల్లు ప్రజాశక్తి క్యాలెండర్

ఆవిష్కరణలో తారకరామా కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏసుబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రంగురంగుల హరివిల్లు ప్రజాశక్తి క్యాలెండర్ అని తారకరామా కన్‌స్ట్రక్షన్ అధినేత పళ్ల ఏసుబాబు అన్నారు. స్థానిక జగనన్న కాలనీలో ఉన్న ఆయన కార్యాలయంలో ప్రజాశక్తి 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఏసుబాబు ఆవిష్కరించి మాట్లాడారు. నూతన సంవత్సరంలో ప్రజాశక్తి నూతన హంగులతో రంగుల హరివిల్లుతో క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. నూతన ఏడాదిలో క్యాలెండర్ రూపంలో అందరికీ శుభాకాంక్షలు తెలపడం ఆనందం గొప్ప ఆలోచన అన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాశక్తి పాఠకులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కార్మికులకు, రైతులకు క్యాలెండర్‌ను అందించడం అభినందనీయమన్నారు. పత్రికా రంగం ఇబ్బందుల మధ్య కొనసాగుతున్నప్పటికీ ప్రజాశక్తి మాత్రం వారి ఇబ్బందిని అనుగుణంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతుందన్నారు. నూతన ఏడాదిలో పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ప్రజాశక్తి యాజమాన్యానికి, ఉద్యోగులకు, సిబ్బందికి, విలేకర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తారకరామా కన్‌స్ట్రక్షన్ వైస్ ప్రెసిడెంట్ పళ్ల తారకరామ్, ప్రజాశక్తి ఎడిటిడి జిల్లా ఇన్‌ఛార్జి పి.నారాయణరావు, భీమవరం జిల్లా కేంద్రం విలేకరి యు.నరేష్, డివిజన్ ఇన్‌ఛార్జి జి.సాయి, భీమవరం రూరల్ విలేకరి జి.నాగరాజు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి పెద్దిరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

ఇటీవల మృతి చెందిన వైసిపి కార్యకర్తల కుటుంబాలను ఆదివారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. మార్టేరుకు చెందిన వెలగలేరు సొసైటీ డైరెక్టర్ రేపస్ దీలర్ మండలాధ్యక్షుడు సోదరిని నాగేశ్వరరావు గుండెపోటు మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పొలమూరులో పార్టీ కార్యకర్త చెన్నం శ్రీను మృతి చెందారు. ఆయన నివాస గృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వీరితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక నుంచి కాపు, తూర్పు కాపు సంక్షేమ సేన

ప్రజాశక్తి - పాలకొల్లు

కాపు సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ, జిల్లాల కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, వివిధ రంగాల అధ్యక్షుల సమావేశం పాలకొల్లులో కాపు సంక్షేమ సేన అధ్యక్షులు చేగొండి హరిరామజోగయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇకపై కాపు సంక్షేమ సేన పేరును కాపు, తూర్పు కాపు సంక్షేమ సేనగా మార్చాలని సమావేశంలో తీర్మానించారు. హైకోర్టులో కాపులకు రిజర్వేషన్ కలుగచేసే విషయంలో కాపు సంక్షేమ సేన తరుపున వేసిన పిటిషన్‌పై రెగులరుగా విచారణలో వివిధ పరిణామాలను, ప్రభుత్వం తమ కౌంటర్‌లో కాపులకు వ్యతిరేకంగా పొందుపరిచిన అంశాన్ని సభ్యుల దృష్టికి తీసుకొని వచ్చారు. 2024 ఎన్నికల్లో కాపు సంక్షేమ సేన జిల్లా, నియోజకవర్గ కమిటీలు ఇతర కాపు సంఘాలను, బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సామాజిక తరగతులను కూడా కలుపుకుని జనసేన, టిడిపి కూటమిని గెలిపించేందుకు కృషి చేయాలని తీర్మానించారు. 2024 ఎన్నికల్లో జనసేన అభ్యర్థులందరికీ కాపు సామాజిక తరగతివారు ప్రతి కుటుంబం రూ.వెయ్యి తక్కువ కాకుండా ఆర్థిక సహకారం చేయాలని కాపు సోదరులందరిని కోరుతూ తీర్మానించారు.

ఘనంగా ఎంఎల్ఎ వాసుబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గణపవరం

ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) పుట్టినరోజు వేడుకలు ఆదివారం భువనపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా డిసిఐ శ్రీనివాసువిశ్వనాథ్, జెడ్‌పి వైస్‌ఛైర్మన్ గంటా పద్మశ్రీప్రసాద్, దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బాయిచౌదరి, మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వాసుబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వాసుబాబు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు అందించారు.

కోపల్లెలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోపల్లెలో డాక్టర్ డి.నిరీక్షణరాజు, శిరీషారాణి దంపతుల ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షత వహించిన పాస్టర్ డాక్టర్ బి.భాగ్యరాజ్ మాట్లాడుతూ వాక్య మానికుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కోపల్లెలో గత తొమ్మిదేళ్లుగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రిస్మస్ కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ బి.భాగ్యరాజ్, రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇక్కడ సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డి.నిరీక్షణరాజు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల నుంచి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. క్రిస్మస్ వేడుకలకు వచ్చిన వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పాస్టర్లు, క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య సేవలకు ఆర్థిక సాయం


మొగల్తూరు : చిన్నారి వైద్య సేవలకు మాంటిస్సోరి పాఠశాల సిబ్బంది ఆర్థిక సహాయం అందించారు. మొగల్తూరుకు చెందిన కొత్తలంక సుబ్రహ్మణ్యం, వీరలక్ష్మి దంపతుల కుమారుడు కొత్తలంక క్రాంతికుమార్(4) మాంటిస్సోరి పాఠశాలలో ఎల్‌కెజి చదువుతున్నాడు. చిన్నారి ఇటీవల భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ పడడంతో తలకు తీవ్ర గాయాలపాలయ్యాయి. ఆ చిన్నారికి విజయవాడలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. క్రాంతికుమార్ తల్లిదండ్రులు పేదవారు కావడంతో పలువురు దాతలు స్పందిస్తున్నారు. దీనిలో భాగంగా పాఠశాల యాజమాన్యం చిన్నారి వైద్య సేవలకు విద్యార్థులు, దాతల సహకారంతో రూ.1.30 లక్షలు సేకరించి చిన్నారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలనుకునే దాతలు ఫోన్ పే నెంబర్లు 9502140689, 9298803876 పంపించాలని పాఠశాల సెక్రట, కరస్పాండెంట్ జక్కంశెట్టి బాబూరావు కోరారు.

యుటిఎఫ్ నేత పెన్మత్స సత్యనారాయణరాజు మృతి

వ్యవసాయ కుటుంబంలో పుట్టి హిందీ ఉపాధ్యాయునిగా ప్రస్థానం ప్రారంభం

యుటిఎఫ్ భవన నిర్మాణంలో కీలక పాత్ర


భౌతికకాయంపై యుటిఎఫ్ పతాకాన్ని ఉంచి నివాళులు



సత్యనారాయణరాజు (ఫైల్)

ప్రజాశక్తి - భీమవరం

అతను ఒక మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. కష్టపడి చదివి హిందీ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సంపాదించి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయ నేతగా ఉన్నత విలువలతో తాను తుది శ్వాస విడిచేవరకూ యుటిఎఫ్ సంఘం అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం భీమవరంలో నిర్మించిన యుటిఎఫ్ జిల్లా కార్యాలయ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మరెవరో కాదు హిందీ రిటైర్డ్ ఉపాధ్యాయులు పెన్మత్స సత్యనారాయణరాజు (74). కొన్ని రోజుల నుంచి అనారోగ్యానికి గురైన ఆయన భీమవరంలో ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. సత్యనారాయణరాజు అకాల మృతి పట్ల యుటిఎఫ్ సంఘం, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సిపిఎం, ప్రజా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ఉండి మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన పెన్మత్స సుందరరామరాజు, వెంకాయమ్మలది వ్యవసాయ కుటుంబం. వీరికి సూర్యకాంతం, సుబ్బమ్మ, భగవాన్‌రాజు, సత్యనారాయణరాజు, కృష్ణంరాజు ఐదుగురు సంతానం. నాలుగో సంతానం సత్యనారాయణరాజు కష్టపడి చదువుకుని హిందీ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించి స్థిరపడ్డారు. ఆయన తమ్ముడు కృష్ణంరాజు కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. వీరిది వ్యవసాయ కుటుంబం కావడంతో స్వగ్రామంలోనే సత్యనారాయణరాజు అన్నయ్య భగవాన్‌రాజు వ్యవసాయం చేస్తూ స్థిరపడ్డారు. హిందీ ఉపాధ్యాయునిగా ఉద్యోగ బాధ్యతల నిమిత్తం సత్యనారాయణరాజు ఎఎస్‌ఆర్ నగర్‌లో స్థిరపడ్డారు. ఎక్కువకాలం సత్యనారాయణరాజు కేశవరం, గొల్లలకోడేరు, పాలకోడేరు, గరగపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పని చేశారు. చివరగా గరగపర్రు హైస్కూల్లో పని చేస్తూ 2007 జులై మూడో తేదీన ఉద్యోగ విరమణ పొందారు. సత్యనారాయణరాజుకు భార్య అనసూయ, కుమార్తెలు సుజాత, లక్ష్మి ఉన్నారు. పెద్ద కుమార్తె సుజాత భీమవరం జెఎల్‌బి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. అల్లుడు సుబ్బరాజు విశాఖపట్నంలో సివిల్ సప్లై అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారు. చిన్న కుమార్తె లక్ష్మి గృహిణిగా ఉండగా ఆమె భర్త నాగబాబు నరసాపురంలో ఒఎన్‌జిసి ఇంజినీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

యుటిఎఫ్ భవనం నిర్మాణంలో కీలక పాత్ర

యుటిఎఫ్ సీనియర్ నాయకులు వెంకటస్వామి, రామిరెడ్డితో సత్యనారాయణరాజు సన్నిహితంగా ఉండేవారు. హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తూనే సత్యనారాయణరాజు యుటిఎఫ్ నేతగా గుర్తింపు పొందారు. యుటిఎఫ్‌లో ఎటువంటి ఉద్యోగ బాధ్యతలు చేపట్టనప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలపై ఎంతో కృషి చేసేవారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం భీమవరంలో నిర్మించిన యుటిఎఫ్ జిల్లా కార్యాలయ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. తోటి ఉపాధ్యాయులతో పాటు ఇతరుల నుంచి విరాళాలు సేకరించడంలో సత్యనారాయణరాజు విశేష కృషి చేశారు. ముఖ్యంగా భవన నిర్మాణాన్ని ఆయనే దగ్గరుండి తన సొంత ఇంటిని నిర్మించుకునేంత శ్రద్ధ వహించారు. నూతన హంగులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో సత్యనారాయణరాజు అందించిన సేవలు ఎనలేనివని ఇప్పటికీ చెబుతున్నారంటే అతిశయోక్తి కాదు. పెన్షనర్స్ అసోసియేషన్‌లో పదవులు చేపట్టకుండానే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారు.

యుటిఎఫ్ నివాళి

సత్యనారాయణరాజు మృతి పట్ల యుటిఎఫ్ ఘన నివాళులర్పించింది. ఎఎస్‌ఆర్ నగర్‌లోని సత్యనారాయణరాజు స్వగృహం వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి యుటిఎఫ్ పతాకాన్ని సత్యనారాయణరాజు భౌతికకాయంపై ఉంచి నివాళులర్పించారు. సత్యనారాయణరాజు భౌతికకాయానికి సీనియర్ నాయకులు ఇశ్రాయేల్‌రాజు, ఎస్‌టిఎ రవివర్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపీ మూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ అభివృద్ధికి, ఉన్నతికి సత్యనారాయణ రాజు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ముఖ్యంగా యుటిఎఫ్ భవన నిర్మాణంలో ఆయన అందించిన సేవల మరువలేనివన్నారను. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూడా సత్యనారాయణ రాజు పాటు పడ్డారని గుర్తు చేశారు.

మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

హిందీ రిటైర్డ్ ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేత సత్యనారాయణరాజు మృతికి చింతిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. సత్యనారాయణరాజు భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్‌తో కలిసి బలరాం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణరాజు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన ఆయన ఎంతో అంకితభావంతో పని చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా ప్రజా ఉద్యమాలకు ఆయన అందించిన తోడ్పాటు ఎనలేనిదన్నారు. సత్యనారాయణ రాజు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.


పెన్షనర్ల అసోసియేషన్ దిగ్భ్రాంతి

హిందీ రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్యనారాయణరాజు మృతి పట్ల పెన్షనర్ల అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సత్యనారాయణరాజు భౌతికకాయాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణరాజు, భీమవరం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు పాల్, కార్యదర్శి సీతారామరాజు, ట్రెజరర్ సూర్యనారాయణ, సభ్యులు భాస్కరరావు, సత్యనారాయణ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై సత్యనారాయణరాజు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సత్యనారాయణ రాజును ఆదర్శంగా తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్

భీమవరం : యుటిఎఫ్ సీనియర్ నాయకులు, హిందీ రిటైర్డ్ ఉపాధ్యాయులు పెన్మెత్స సత్యనారాయణరాజు అకాల మరణం అత్యంత బాధాకరమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం రాత్రి సత్యనారాయణ రాజు మతి పట్ల సంతాపసభ నిర్వహించారు. సత్యనారాయణరాజు చిత్రపటానికి యుటిఎఫ్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సత్యనారాయణ రాజు ఎంతో కృషి చేశారన్నారు. యుటిఎఫ్ భవన నిర్మాణంలో సైతం అందించిన సేవలు అమోఘమన్నారు. యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు సత్యనారాయణరాజును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, పి.సీతారా రామరాజు, అలుగు ఇజ్రాయెల్‌రాజు, ఎస్‌టిఒ అల్లూరి రవివర్మ, జివివి.రామానుజరావు, సత్యనారాయణరాజు, చింతపల్లి ప్రసాదరావు, మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

నినాదాలు.. నిరసనలు

20వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



వీరవాసరంలో...

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారంతో 20వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆటలు ఆడి, పాటలు పాడి తమ నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - వీరవాసరం

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆదివారం కబడ్డీతో నిరసన వ్యక్తం చేశారు. సమ్మె ప్రారంభించిన నాటి నుంచి వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న వారు ఆటతో నిరసన తెలపడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, యూనియన్ నాయకురాలు నాగర్నతం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ శిబిరం వద్దకు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ వచ్చి సంఘీభావం తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు ఆటల, పాటలు, నృత్య ప్రదర్శన నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి సమ్మెను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించడంలో నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, మహేశ్వరి, పద్మావతి, కమల, సత్యవతి, మహేశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

అత్తిలి : అత్తిలిలో అంగన్‌వాడీలు కోలాట నృత్యంతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి ధర్మేంద్ర, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ఆట పాటలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, పెనుమంట్ర, మార్టేరు, ఆలమూరు సెక్టార్ నాయకులు సాయి మహాలక్ష్మి, మౌనిక, సరస్వతి, కార్యకర్తలు శాంతి, టిఎల్‌డి భవాని, భాగ్యలక్ష్మి, కల్యాణి, ఆదిలక్ష్మి, కుమారి, శాంతకుమారి, సులోచన పాల్గొన్నారు.



పాలకొల్లులో...

పోడూరు : పోడూరులో అంగన్వాడీలు కబడ్డీ అడుతూ, పాటలు పాడుతూ తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం తరుపున ఒక జట్టుగా, అంగన్‌వాడీల తరపున ఒక జట్టుగా ఏర్పడి కబడ్డీ ఆడారు. ఈ ఆటలో ప్రభుత్వ జట్టుపై అంగన్‌వాడీల జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడుకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక తాడేపల్లిగూడెం



ఆచంటలో...

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటలు ఆడి పాటలు పాడి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాలులో పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సంస్మరణ సభకు హాజరై నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు స్వరూపరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకటదుర్గారావు, ప్రభారాణి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బండారు మహాలక్ష్మి, కల్యాణి, ధనలక్ష్మి, జయలక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన దీక్షలు 20వ రోజు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భీమవరంలో సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కల్యాణి మాట్లాడారు. అంగనవాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, మేరీ గ్రేస్, మరియమ్మ, దుర్గ కుమారి పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్‌పై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో మెడికల్ రిప్రజెంటిటీవ్‌ల వార్షిక మహాసభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో భీమవరం శాఖ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటీవ్‌ల సేల్స్ పరమైన ఒత్తిడి ఎక్కువవుతుందన్నారు. ఫార్మా కంపెనీలు చట్టాల ఉల్లంఘన పెద్దఎత్తున జరుగుతుందన్నారు. ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల కాలంలో మెడికల్ రిప్రజెంటేటీవ్‌ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం (1976)ని పూర్తి స్థాయిలో అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటీవ్‌లపై ఫార్మా కంపెనీలు నూతన సాంకేతిక పరికరాలు ఉపయోగించి తీవ్రమైన పని ఒత్తిడిని కలుగజేస్తున్నాయన్నారు. భీమవరం శాఖ కార్యదర్శి సూర్యచంద్రరాజు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటీవ్‌లకు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మాంటిస్సోరి స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక లజపతిరాయ్‌పేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం జూనియర్ కళాశాల ప్రాంగణంలో అక్షర జూనియర్ కళాశాల, మాంటిస్సోరి జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఈ మెరిట్‌స్కాలర్‌షిప్ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. మాంటిస్సోరి జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పేద, మధ్య తరగతికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఉచిత విద్య అందించాలని సదుద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు. స్టడీ మెటీరియల్ బుక్‌లెట్స్‌ను ఎంఇఒ శర్మ విడుదల చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ పదో తరగతికి సంబంధించిన మోడల్ క్వశ్చన్ పేపర్ బుక్లెట్‌ని ఉచితంగా అందించారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బి శాఖాధికారులతో ఆయన ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిధులు మంజూరై టెండర్లు ప్రక్రియ పూర్తయిన ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నరసాపురం మండలం జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, మొగల్తూరు మండలం జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాబ్జి, రోడ్డు భవనాల శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి లోకేశ్వరరావు, డిఇ కిరణ్, గుత్తేదారులు

మానవత సంస్థ సేవలు అభినందనీయం



సన్మానిస్తున్న వక్తలు

ఆచంట (పెనుమంట్ర) : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో నెలవారి సమావేశం ఆదివారం మానవత కార్యాలయం వద్ద నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మార్టేరుకు చెందిన వెంకటేశ్వర హాస్పిటల్స్ వైద్యులు కడలి సాయి హర్ష ముఖ్య అతిథిగా వచ్చారు. మండల వ్యాప్తంగా మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను, వైద్యులు సమాజానికి చేస్తున్న సేవలను పలువురు వక్తలు కొనియాడారు. నెలవారీ సమావేశంలో సంస్థ అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను సన్మానించడం ద్వారా మరింత మంది విద్యార్థులను ఉత్తేజపరచవచ్చన్నారు. యోగా గురువు పడాల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి మార్టేరు వరాహ స్వామి కళ్యాణ మండపంలో నెల రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఇస్తామని మానవత సంస్థ తరపున అందరికీ ఆహ్వానం పలికారు. మానవత సంస్థ చేస్తున్న కార్యక్రమాలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, మానవత కమిటీ సభ్యులు పడాల రామచంద్రారెడ్డి, కడలి వెంకటేశ్వరరావు, కడలి సుబ్రహ్మణ్యం, కోనాల నర్సిరెడ్డి, దొంగ జయదుర్గారావు, చిర్ల వంశీ హరినాథ్‌రెడ్డి, సత్తిసుబ్బన్నరెడ్డి, రొబ్బి భాస్కరరావు, కానూరు మోహన్‌రావు, డాక్టర్ పోడూరు కృష్ణమూర్తి, డాక్టర్ మురళీజోగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

నూతన సంవత్సర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో రంగులు, పూలు పండ్లు కేకులు అమ్మకాలు జోరుగా సాగాయి. కేకులు తగ్గింపు ధరల్లో లభ్యం కాగా పూలు, పండ్ల ధరలు మాత్రం కొండెక్కాయి. మండలంలోని పలు క్రీస్తు ప్రార్థన మందిరాల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ రాజకుమార్ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆచంట : నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. ఆచంటలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు అల్లం జ్యోతి రామానుజం, తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, బొడపాటి బుల్లియ్య, మనవర్తి విజయ్‌కుమార్, మండేలా శ్రీనివాస్, దేవిరెడ్డి రాంబాబు, ఉమేష్, సాక మహేష్ బాబు, మూడకల నానిబాబు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.65/2023

వాది : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రక్కిలంక బ్రాంచ్

మరియు

ప్రతివాది : షేక్ వినయ తుల్లా

దావా నోటీసు

ప్రతివాది అడ్రస్ : శ్రీ షేక్ వినయ తుల్లా, తండ్రి షేక్ భాషా, పు, 44 సంIIలు, డోర్ నెంబర్ 23బి-5-30, SESDMH School, రామచంద్రరావుపేట, ఏలూరు, ఏలూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై దావా పరిహార నిమిత్తం వాది మీపై దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీరు ప్రతివాది అయివున్నారు. కావున మీరు స్వయంగా కానీ ప్లీడర్ గారి ద్వారా గాని ది.11.01.2024 తేదీన ఉదయం 10.30 కు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరు.

వాయిదా తేది. 11-01-2024

పి.ఉదయ భానుజీ

కొవ్వూరు వాది తరపు అడ్వకేట్

తేది.30-12-2023 కొవ్వూరు.